క్లుప్తంగా

బావోజీలకు వేతనాలు ఇవ్వాలని వినతి


మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : గిరిజన దేవాలయాల్లో విధులు నిర్వర్తించే బావోజీలకు దూపదీప నైవేద్య పథకం ద్వారా గౌరవ వేతనం అందించాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలో అత్యధికంగా గిరిజనులు ఉన్నారని, గిరిజన దేవాలయాల్లో విధులు నిర్వర్తించే బావోజీలకు సముచిత గౌరవవేతనం అందించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట పలువురు బావోజీలు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


తనిఖీ చేస్తున్న పోలీసులు

కొండమల్లేపల్లి : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని కొండమల్లేపల్లి ఎస్ఐ వీరబాబు హెచ్చరించారు. గురువారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ సహకారంతో కొండమల్లేపల్లిలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు ఉన్న విత్తనాలు మాత్రమే విక్రయించాలని, లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయించినా, నకిలీ విత్తనాలు విక్రయించిన చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రైతులు అనుమతులు ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేసి రశీదు పొందాలని సూచించారు.

జంగయ్య మృతి పార్టీకి తీరని లోటు

మర్రిగూడ : మండలంలోని తిరగండ్లపల్లి సీపీఐ సీనియర్ నాయకుడు మావిళ్ల జంగయ్య మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. గురువారం జంగయ్య దశదిన కర్మకు హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు చల్లా పాండురంగారావు, కార్యవర్గ సభ్యుడు ఎరుకల నిరంజన్, పార్టీ నాయకులు అల్వాల నర్సింహ, బాలకిషన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ పాల దందా అరికట్టాలి

నల్లగొండ టూటౌన్ : జిల్లాలో కల్తీ పాల దందా అరికట్టాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. పాల కల్తీకి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజు వేల లీటర్ల పాలను కల్తీ చేస్తున్నారని వివరించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కల్తీ పెరిగిపోయి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో డీవైఎఫ్ఐ నాయకులు గుండాల నరేష్, కోరే నరేష్, శ్రీనివాస్, ఏడుకొండలు, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థికసాయం


ఆర్థికసాయం చేస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని కత్తుల అలివేలుకు ఎన్నారై శ్రీకాంత్ రావినూతల సమకూర్చిన రూ.50 వేల నగదును గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు గుత్తా అమిత్‌రెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గుత్తా అమిత్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య విద్యార్థినికి ఎన్నారై శ్రీకాంత్ రావినూతల ఆర్థిక సాయం చేయడం అభినందనీయమన్నారు.

బాధిత కుటుంబానికి..

మునుగోడు : మండలంలోని చొల్లేడు గ్రామానికి చెందిన కొంక శంకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబానికి చొల్లేడు సర్పంచ్ జనిగల మహేశ్వరిసైదులు గురువారం రూ. 10 వేల ఆర్థికసాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వనం నిర్మలయాదయ్య, ఉప సర్పంచ్ గోదాల శంకర్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బుడిగపాక ఏసు, వనం లింగయ్య, దోటి నాగరాజు, పాల్గొన్నారు.

ఆహ్లాదం పంచని పార్కులు

- నిర్వహణ లేక ఎండుతున్న మొక్కలు, గడ్డి
- పక్కనే జలాశయం ఉన్నా నీరు పెట్టే వారు కరువు
- సిబ్బందిని కేటాయించాలని కోరుతున్న స్థానికులు, పర్యాటకులు


ఎండిపోయిన ఎస్‌బీఐ పార్కు


నీరు లేక ఎండిపోయిన తామర కొలను

నాగార్జునసాగర్ : ప్రపంచపర్యాటక ప్రదేశమైన నాగార్జునసాగర్‌లోని పార్కుల్లో పచ్చదనం కరువయ్యింది. పార్కులను ప్రాజెక్టు, మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారాయి. పక్కనే జలాశయం ఉన్న పార్కుల్లో గడ్డికి నీరు పెట్టేందుకు మనుషులు కరువయ్యారు. దీంతో ఆ పార్కుల్లోని మొక్కలు, చెట్లు, గడ్డి ఎండిపోయాయి. ఆ పార్కులను ఎన్నెస్పీ కానీ మున్సిపాలిటీ కానీ పట్టించుకోవడంలేదు. ఎన్నెస్పీలో 76మంది ఎన్యూమర్లతో పాటు తోటమాలులు, నైట్ వాచ్‌మెన్‌లు, కార్యాలయాల్లో పనిచేసే దిగువ స్థాయి ఉద్యోగులు అధికారుల ఇళ్లలో పనిచేస్తున్నారు. గతంలో సాగర్ డ్యాం ఆధునీకరణ పనులు జరిగినప్పుడు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన ఉద్యోగికి ఈఈ టైప్ క్వార్టర్ కేటాయించారు. ఆ క్వార్టర్ ప్రస్తుతం ఎవరూ ఉండరు కానీ ఇప్పటికీ నలుగురైదుగురు నిత్యం పనిచేస్తూనే ఉంటారు. ఇలా అన్ని స్థాయిల్లో ఉండే ఉన్నతాధికారుల ఇళ్లలో పనిచేస్తున్నారు కానీ ఆ పార్కులకు నీళ్లు పెట్టేవారు కరువయ్యారు.

60 ఎకరాల్లో.. నాలుగు పార్కులు

ఎన్నెస్పీ పరిధిలో సుమారు 60 ఎకరాల్లో నాలుగు పార్కులు ఉన్నాయి. హిల్‌కాలనీలో రెండు పార్కులు, పైలాన్‌లో మూడు పార్కులు ఉన్నాయి. సీఈ కార్యాలయం ఎదుట ఒక పార్కు ఉంది. ఆ కార్యాలయం అక్కడి నుంచి తరలిపోగా ఆ కార్యాలయ స్థలాలను నందికొండ మున్సిపాలిటీకి అప్పగించారు. మన్సిపాలిటీ వారు ఆ పార్కులో నర్సరీని పెట్టి మొక్కలు పెంచుతున్నారు. నెహ్రూ పార్కులో పుష్కరాల సమయంలో గడ్డి పరిచి ఫౌంటెన్లు ఏర్పాటు చేశారు. ఆ పార్కులోని గడ్డికి నీరుపెట్టే వారు లేక ఎండిపోయింది. నిత్యం గేదెలను తోలుతున్నారు. అలాగే పైలాన్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు పక్కనగల పార్కుకు నీరుపెట్టక పోవడంతో పూర్తిగా ఎండి పోయింది. ఒకప్పుడు ఆ ప్రాంతమంత పూలమొక్కలు పచ్చని తివాచీ పరిచినట్లు గడ్డి ఉండేది. అక్కడ సినిమా షూటింగ్ జరిగిన సందర్భాలు న్నాయి. ఇక్కడి ‘గజాబా’ కింద నిత్యం పర్యాటకులు కూర్చొని సేద తీరేవారు. దానిపైగల ఆకులు కలిగిన తీగలు ఎండి పోవడంతో వెక్కిరించినట్లు కనిపిస్తుంది. పైలాన్ ఫిల్లర్ పార్కులో పెరిగిన పిచ్చిగడ్డిని తొలగించక పోవడంతో పశువులు మేసే గడ్డి పెరిగి బీడుగా మారింది. ఎర్తుడ్యాం దిగువన గల శివం పార్కు బృందావనం పార్కును పోలి ఉంటుంది. ఇది సెక్యూరిటీ జోన్లోకి వెళ్లడంతో కంపచెట్లు పెరిగాయి. ఇటీవలే ఆకంపచెట్లను తొలగించారు. ఇప్పటికైన కొంతమందిని సిబ్బంది నీళ్లు పెట్టి పచ్చదనం, ఆహ్లాదం పచ్చేలా చూడాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.

మున్సిపాలిటీకి అప్పగించాలి



పార్కులు పర్యాటకులకు అహ్లాదాన్ని కలిగించేలా పచ్చదనంగా ఉండాలంటే వాటికి నిత్యం నీటి సౌకర్యం కల్పించాలి. అందుకుగాను డ్రిప్పు, స్ప్రింక్లర్లను ఏర్పాటు చేయాలి. కొంత మంది సిబ్బందిని పార్కులకు నీరు పెట్టేందుకు కేటాయించాలి. ఎవరూ ఎక్కపనిచేసేది రికార్డుగా ఉండేలా ఉన్నతాధికారులుచూడాలి. ఎన్నెస్పీ నుంచి మున్సిపాలిటీకి అప్పగించాలి

- వేణు, స్థానికుడు

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : మహిళా సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. గురువారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దేవరకొండ, డిండి మండలాలకు చెందిన 36మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం కొండంత భరోసా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మారుపాకుల అరుణసురేష్‌గౌడ్, వైస్‌ఎంపీపీ చింతపల్లి సుభాష్, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, టీవీఎన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


యాద్గార్‌పల్లిలో డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి

మిర్యాలగూడ : గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సహకారంతో రూ.45లక్షలతో ఆర్‌అండ్‌బీ డ్రెయినేజీ మంజూరు కాగా ఆయన శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ గణేష్, జేఈ రాంబాబు, తడకమళ్ల పీఏసీఎస్ చైర్మన్ పాదూరి సంజీవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వేణుగోపాల్ రావు, సర్పంచ్ దుండిగాల యాదమ్మశ్రీనివాస్, ఉపసర్పంచ్ సుధాకర్, ఎల్లయ్య, ఎర్రయ్య, పద్మ, వీరేశం, వెన్నెల, వెంకట్‌రెడ్డి, అంజయ్య, నాగేందర్, చిమట ఆంజనేయులు, గ్రామ కార్యదర్శి రవి, నాగేంద్రబాబు, వెంకట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు రోజూ పని కల్పించాలి

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో పనులు చేసే రోజువారి కూలీలకు పనులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, కూలీలకు ప్రతిరోజు పనులను కల్పించాలని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి అనుసంధానం చేయడం వల్ల ఉపాధి హామీ పనులు 200 రోజుల దొరికే పరిస్థితి ఉంటాయని, ఉపాధి హామీ కూలీలకు జీవనోపాధి కలిగే పరిస్థితులున్నారు.

మర్రిగూడ తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు


బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

మర్రిగూడ : మర్రిగూడ మండల తహసీల్దార్‌గా దేవులపల్లి వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి కట్టంగూర్‌కు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లుకు డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారకరామన్, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

బలహీన వర్గాల కోసం రాజీలేని పోరాటం


గురువయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : బడుగు, బలహీన వర్గాల కోసం పరితపించే నేత, వారి సమస్యల పరిష్కారం కోసం రాజీలేని ఉద్యమాలను చేపట్టిన సీపీఎం నేత పెలపోలు గురువయ్య అని ఆపార్టీ మండల నాయకులు మూఢావత్ రవినాయక్, పెలపోలు శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని జప్తీ వీరప్పగూడెం గ్రామంలో సీపీఎం నేత పెలపోలు గురువయ్య రెండో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువయ్య చివరి శ్వాస విడిచేంత వరకు కూడా పేదల పక్షానే నిలిచారని, ఆయన త్యాగాలు మరువలేనివని, ఆయన ఆశయ సాధనతో పాటు ఆయన చూపిన మార్గంలోనే పార్టీ కార్యకర్తలు నడవాలన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా ఎర్ర జెండాను వీడలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, నాగయ్య, లింగయ్య, సైదయ్య, మోటుసాబ్, రవి, సత్యనారాయణ, యాదగిరి, శివ, రవి, సానుభూతిపరులు తదితరులున్నారు.

యాదవకులస్తులకు క్షమాపణ చెప్పాలి

గుర్రంపోడు : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఉద్దేశించి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిని వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని మంత్రికి, యాదవకులస్తులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మండల యాదవ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గుర్రంపోడులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యాదవుల సత్తా ఏందో ఈ నెల 20న జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమంలో చూపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఆవుల వెంకన్న యాదవ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దోటి చంద్రమౌళి, బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మల్లేషం, యాదయ్య, భాస్కర్, మల్లయ్య, రమేష్ పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతి చేసుకోవాలి


మాట్లాడుతున్న ఆర్డీఓ చెన్నయ్య

హాలియా : మిల్లర్లు, ఎప్పటికప్పుడు ధాన్యం దిగుమతి చేసుకోవాలని మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య సూచించారు. గురువారం అనుముల మండలంలోని పాలెం సమీపంలో ఉన్న వజ్రతేజ రైస్ మిల్లులో ధాన్యం దిగు మతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మిల్లులో ధాన్యం దిమగుతులు, గోదామును ఆర్డీఓ చెన్నయ్య పరిశీలించి మాట్లాడారు. రైతులు ఇబ్బంది పడకుండా లారీలో మిల్లులకు వద్దకు ధాన్యాన్ని వేగవంతంగా దిగుమతి చేసుకోవాలని మిల్లర్లను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ మంగ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్టిప్రోలు యాదగిరి తదితరులు ఉన్నారు.

20న ఆర్, ఆర్,ఆర్ కేంద్రాలు ప్రారంభం

దేవరకొండ : ఈనెల 20న మేరీ లైఫ్ – మేర స్వచ్ఛ షహర్‌లో భాగంగా పట్టణంలోని 20 వార్డుల్లో రీయూజ్, రెడ్‌యూజ్, రీ సైకిల్(ఆర్.ఆర్.ఆర్) కేంద్రాలను ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య తెలిపారు. గురువారం దేవరకొండలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 రోజుల పాటు 20 వార్డుల్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి వార్డు ఆఫీసర్లు, ఆర్‌పీలు బాధ్యతలు వహించాలన్నారు. ఆయా వార్డుల్లో వార్డు ప్రజల ఇంట్లో ఉన్న పాత సామాన్లు, బట్టలు, పాత పుస్తకాలు, సీసాలు, కాగితాలు మొదలైనవి బయట పడేయకుండా ఆర్.ఆర్.ఆర్ కేంద్రాలకు తరలించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సమావేశంలో ఆర్‌పిలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి


వివరాలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

మిర్యాలగూడ టౌన్ : ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేసా రవి ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ సిబ్బంది, ఉద్యోగులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఆర్ ఏ విధంగా చేయాలో తెలుసుకుంటే ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని రక్షించే అవకాశం ఉందన్నారు. ప్రతి పారిశుద్ధ్య కార్మికుడు, మున్సిపల్ సిబ్బందికి తప్పని సరిగా సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణతో పాటు పలువురు వైద్య సిబ్బంది, కార్మికులు, ఉద్యోగులు ఉన్నారు.

ఈదులగూడెంలో తాగునీటి కష్టాలు


పబ్లిక్ నల్లా వద్ద బారులుదీరిన ప్రజలు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో తాగునీటి కోసం లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తూ ప్రతి రోజూ నీళ్లు ఇస్తున్నామని అంటున్నారే తప్ప.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆచరణ కావడం లేదు. మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడెంలో నాలుగు రోజుల నుంచి తాగు నీటి సరఫరా కావడం లేదు. దీంతో ఆ వార్డు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పంటపొలాల వద్ద ఉన్న బోర్ల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. పబ్లిక్ నల్లా వద్ద నీళ్లు వస్తాయనే ఉద్దేశ్యంతో కాలనీవాసులు ఖాళీ బిందెలు తీసుకొచ్చి నల్లా వద్ద క్యూలో నిల్చుంటున్నారు. అధికారులు తాగునీటి సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి


ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీఓఏలు

దేవరకొండ : ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్లా వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు దేవరకొండ ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వీఓఏల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల్లో మహిళలను చైతన్య పరుస్తూ బ్యాంకుల ద్వారా వారికి రుణాలు ఇప్పించి ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధికి తోడ్పడే వీఓఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బిజిలి లింగయ్య, బుడిగ వెంకటేశ్, ముదిగొండ రాందాస్, శరత్, సైదాబేగం, జంగయ్య, లింగయ్య, నిర్మల, చంద్రకళ, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, సమావేశానికి హాజరైన అధికారులు

నల్లగొండ : మున్సిపాలిటీల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో మెరుగైన స్థానం సాధించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల ఇంజనీర్లు, ఈఈ పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి

ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి జీపీలో సరాసరి 200 మంది కూలీలకు పనులు కల్పించాలని అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ నుంచి డివిజనల్ పంచాయతీ అధికారులు, ఏపీడీలు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. కూలీలకు రోజువారి వేతనం రూ.272 వచ్చేలా పనులు కల్పించాలన్నారు. నర్సరీలలో మొక్కలకు షేడ్ నెట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. క్రీడా ప్రాంగణాలకు సరఫరా చేసిన క్రీడా పరికరాలు ప్రాంగణాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి, డీఆర్‌డీఏ ఏపీడీ శైలజ పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలో ఆర్ఎంపీలు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 28వ రోజు చేరారు. గురువారం దీక్షలో ఆర్ఎంపీలు కుర్చున్నారు. ఆర్ఎంపీలకు ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులుతో పాటు కమిటీ సభ్యులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీలు వెంకటేష్, అశోక్, రాములు, అనంతరెడ్డి, రాఘవులు, యాదయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో కూర్చున్న ఆర్ఎంపీలు

పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

మర్రిగూడ : అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వైఎస్సార్ టీపీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వనమాల ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి ఆర్థికంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సి ప్రభుత్వం ఇప్పటి వరకు సాయం అందించలేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేల నుంచి రూ.40వేల నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

తాలు తంటాలు


జేసీబీతో తాలు పడుతున్న రైతు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాలు తంటాలు తప్పట్లేదు. తాలు ఉందని కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం తూర్పార పట్టేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా గురువారం పెద్దవూర మండలం సంగారం గ్రామానికి చెందిన కౌలు రైతు మంచికంటి వెంకటేశ్వర్‌రెడ్డి స్థానికంగా కొనుగోలు కేంద్రం వద్ద ఓ రోడ్డుపై జేసీబీ, కూలీల సహాయంతో ధాన్యం తూర్పార పడుతూ కనిపించాడు. - పెద్దవూర

మరో షిర్డీ.. చింతపల్లి సాయి ఆలయం


సాయిబాబా మూల విరాట్


ముస్తాబవుతున్న చింతపల్లి సాయిబాబా దేవాలయం

- 20, 21, 22 తేదీల్లో వార్షికోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

చింతపల్లి : చింతపల్లి సాయిబాబా ఆలయం మరో షిర్డీగా విరాజిల్లుతోంది. హైదరాబాద్–నాగార్జున సాగర్ ప్రధాన రహదారిపై మండల కేంద్రంలో ఈ ఆలయాన్ని సుమారు రెండు ఎకరాల స్థలంలో సుందరంగా నిర్మించారు. ఈ ఆలయ 16వ వార్షికోత్సవాలను ఈనెల 20వ తేదీ నుంచి 22వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయ కమిటీ ఏర్పాట్లును పూర్తి చేసింది. ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు.

వార్షికోత్సవ వివరాలు

ఈనెల 20న గణపతి ప్రార్థన, గో పూజ, యోగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, 21న దంపతులతో సామూహిక గో పూజ, శ్రీవల్లి దేవసేనా సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవం, నీరాజనం, దత్తాత్రేయ సరస్వతీ దేవత మూల మంత్ర అవాహనములు, అష్టోత్తర పూజలు, హైదరాబాద్‌కు చెందిన సాంబమూర్తి భగవతార్ ఆధ్వర్యంలో సాయి లీల హరి కథలు కార్యక్రమం నిర్వహించనున్నారు. 22న సాయినాథుడికి, విఘ్నేశ్వరుడికి, దత్తాత్రేయ, సరస్వతి, కాశీ విశ్వేరస్వామి విగ్రహాలకు కలషాభిషేకాలు, ముక్కోటి బ్రహ్మ గురూజీ ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన ఉంటాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా బ్రహ్మశ్రీ వడ్లకొండ రామశరణ్ శర్మ చండీ ఉపాసకులు హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



20 నుంచి 22వ తేదీ వరకు జరిగే చింతపల్లి సాయినాథుడి దేవాలయ 16వ వార్షికోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశాం. వేసవి కావడంతో భక్తుల కోసం చలువ పందిళ్లు, అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. పార్కింగ్ సదుపాయం కూడా కల్పించాం.

- మంచికంటి ధనుంజయ్య, ఆలయ కమిటీ చైర్మన్